

# గ్రీన్ కార్డ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

***రచనాకాలం: 2000 సంవత్సరం***

**"ప్లీజ్ డు కమిన్."**

ఇద్దరూ లోపలికి వచ్చారు. హాల్లోని సోఫా చూపించాడు గోపీనాథ్.

"వియ్ హేవ్ బ్యాడ్ న్యూస్ ఫర్ యు" చెప్పాడు మొదటివాడు.

గోపీనాథ్‌కి అర్థం అయ్యింది అదేమిటో. రెండోవాడు మిగిలిన గదులు తలుపులన్నీ తెరిచి లోపలకి తొంగి చూడసాగాడు.

"సో, ఇట్స్ నో?" అడిగాడు గోపీనాథ్ నిస్పృహగా చూస్తూ.

"ఇటీజ్ ఎ డెఫినెట్ నో."

"మిగిలినవాళ్ళు ఎక్కడికి వెళ్ళారు?" అడిగాడు రెండోవాడు ఫ్లాట్‌లో గోపీనాథ్ తప్ప ఇంకెవ్వరూ లేరని తృప్తిపడ్డాక –

"వాళ్ళు నాతో చెప్పి వెళ్ళలేదు."

"నిన్ను డిపోర్ట్ చెయ్యడానికి వచ్చాం" మొదటివాడు నవ్వుతూ చెప్పాడు.

"ఓ!"

"నీ పొలిటికల్ అసైలమ్ అప్లికేషన్ మంజూరు కాలేదు. కాబట్టి నువ్వు యునైటెడ్ స్టేట్స్ నుంచి వెళ్ళక తప్పదు."

"కానీ నేను ఇండియా వెళితే నన్ను ప్రాణాలతో ఉంచరు" భయంగా చెప్పాడు గోపీనాథ్.

"అవన్నీ ఆలోచించే నీ అప్లికేషన్‌ను రిజెక్ట్ చేశారు. దానర్థం అప్లికేషన్‌లోని క్లెయిమ్స్ అనీ అబద్ధాలని."

"అబద్ధాలు కావవి. నిజాలు."

"కాని అది నువ్వు సమర్థవంతంగా రుజువు చేయలేకపోయావు" రెండవవాడు సానుభూతిగా చూస్తూ చెప్పాడు.

"లెట్స్ గెట్ గోయింగ్. ఏ సామాను తీసుకెళ్ళదలచుకుంటే అది సర్దుకో, వన్ వే టిక్కెట్ ఇండియాకి ఆరువందల డాలరు."

"నా దగ్గర అంత డబ్బులేదు."

గోపీనాథ్ మనసులోనే సంతోషించాడు. తనింతకాలం సేవ్‌చేసిన డాలర్లన్నీ ఇండియాకి పంపి మంచి పనిచేశాననుకున్నాడు.

"కపూర్, రెడ్డిలకు కూడా డిపోర్టేషన్ ఆర్డర్స్ జారీ చేశారా?" అడిగాడు గోపీనాథ్.

"అవును! నేన్టీస్ నైన్టీసెవన్‌లో అప్లయ్ చేసిన ఇండియన్స్ అందరి అప్లికేషన్లు రిజెక్ట్ అయ్యాయి."

"ఓ!"

"ఏదో విధంగా నువ్వు ఆరువందల డాలర్లు పుట్టించాలి. కావాలంటే ఎవరయినా ఫ్రెండ్స్‌కు ఫోన్ చెయ్యి."

"యు.ఎస్.లో నాకలాంటి ఫ్రెండ్స్ ఎవరూ లేరు. ఇంతకీ నా డిపోర్టేషన్ ఆర్డరు నాకు మీరు చూపించనేలేదు."

మొదటి అతను జేబులోనుంచి ఒక కాగితం తీసి గోపీనాథ్‌కు చూపించాడు. అది తను అమెరికన్ ప్రభుత్వానికి అప్లయ్ చేసుకున్న పొలిటికల్ అస్సైలమ్‌ని రిజెక్ట్ చేసిన ఆర్డరుగా గుర్తించాడు. గోపీనాథ్‌కు తెలుసు తను అడిగేది వాళ్ళు ఒప్పుకోరని. అయినా ప్రయత్నించడంలో తప్పులేదను కున్నాడు.

"సపోజ్ మీరు వచ్చిన టైంకు నా అపార్ట్‌మెంట్ లాక్ చేసి ఉంది. ఒక ఐదు నిమిషాలు ఆగి వస్తే నేనుండను. కాబట్టి మీరు బయటకు వెళ్ళి మళ్ళీ వస్తే నాకు సహాయం చేసిన వారవుతారు. ఆ రహస్యం నేను కాపాడతాను" దీనంగా చెప్పాడు గోపీనాథ్.

"నో. లెట్స్ మూవ్."

"నేను మా దేశం వెళితే నన్ను ప్రాణాలతో ఉంచరు. మీరు నన్ను పంపడమంటే ఇన్‌డైరెక్ట్‌గా నా హత్యలో భాగం పంచుకోవడమే." వాళ్ళ దయ మీద కొట్టాలని ప్రయత్నించాడు.

ఇద్దరి మొహాల్లో సానుభూతి లేదు.

"నైన్. యమ్. యమ్. లేదా ఎ.కె. ఫార్టీ సెవెన్ తుపాకి గుండు ఇక్కడ గుచ్చుకుంటుంది."

గోపీనాథ్ తన నుదుటి మీద వేలునుంచి చూపించాడు.

"ఆఖరిసారి అడుగుతున్నాను. ఇండియాకి వన్-వే-ఏర్ టిక్కెట్టుకు ఆరువందల డాలర్లు ఉన్నాయా? లేవా?" అడిగాడు మొదటివాడు.

"ఖచ్చితంగా లేవు."

"సో బి ఇట్."

వాళ్ళు వేసిన బేడీలు చూడగానే గోపీనాథ్‌కు అర్ధమయ్యింది. ఆ రోజుతో తనకి అమెరికాకి రుణం తీరిపోయిందని. తను కపూర్, రెడ్డిలలాగా ఎక్కడికయినా పారిపోవాల్సింది. పట్టుకున్నప్పటి మాట కదా? తనలాంటి వారు అమెరికాలో వేలల్లో ఉన్నారు.

"సెవన్ ఎలివెన్‌కు ఫోన్ చేసి నా రూం మేట్ ఇమ్మాన్యువల్‌తో జరిగింది చెప్తాను."

"ఓ.కె. ఒక ఫోన్ కాల్ చేసుకునే హక్కు వుంది నీకు."

ఇమ్మాన్యువల్ లైన్‌లోకి రాగానే చెప్పాడు గోపీనాథ్.

"హాల్లో నేను గోపీని. ఐ ఎన్. ఎస్ వాళ్ళు వచ్చి నన్ను డిపోర్టేషన్‌కు తీసుకువెళుతున్నారు."

"బ్లడీ షిట్. ఐ యామ్ సో సారీ ఫర్ యు."

"ఐ యామ్ వెరీ గ్రేట్ ఫుల్ టు యు. నువ్వు నాకు ఎన్నో సహాయాలు చేశావు."

"ప్లీజ్. ఇ మెయిల్ టు మి. విల్ యు?"

"ష్యూర్. బై."

"బై బై అండ్ హావ్ ఎ ప్లెజంట్ జర్నీ."

గోపీనాథ్ రెండు చేతుల్ని వెనక్కి వంచి అతని చేతులకు బేడీవేశారు.

టి.వి.ని కంప్యూటర్‌ని ఆఫ్ చేశారు వాళ్ళు. ఆ తర్వాత ముగ్గురు ఆ అపార్ట్‌మెంట్‌లోంచి బయటకు నడిచారు.

అమెరికా నుంచి స్వదేశానికి పంపబడే వాళ్ళ విషయాల్లో అమెరికాలో పాటించే విధానాలే ముప్పై రెండేళ్ళ గోపీనాథ్

విషయంలోనూ పాటించారు. తన దేశానికి వెళ్ళే విమానం టిక్కెటును కొనుక్కునే పరిస్థితిలో లేనప్పుడు అమెరికానుంచి అతన్ని స్వదేశానికి వెళ్ళే కార్గో షిప్‌లో ఎక్కించి పంపుతారు. స్వదేశం చేరుకున్నాక ఆ షిప్‌ను అతని రవణాకి అయిన మూల్యం అతని తరపున ఎవరైనా వచ్చి చెల్లించి అతనిని విడిపించుకోవాలి.

ముందే సమాచారం పంపడంతో గోపీనాథ్ తండ్రి అందుకు ఇరవై మూడువేల రుపాయలు చెల్లించడానికి తన సమ్మతిని తెలియజేశాడు. ఆయన అలా సమ్మతించని పక్షంలో తనకొడుకు అమెరికన్ జైల్లో జీవితాంతం మగ్గడం తప్పదని ఆయనకు తెలుసు.

సీ పోర్ట్‌కు గోపీనాథ్‌తో బయలుదేరారు ఐ.ఎన్.ఎస్. అధికారులు ముగ్గురు. గోపీనాథ్ కారు కిటికీలోంచి బయటకు చూస్తున్నాడు. ఒకసారి తను ఈ అమెరికా నేలని వదిలితే ఇక తిరిగి ఈ గడ్డమీద కాలు పెట్టలేదని తెలుసు. ఇక ఏ రకం వీసా కూడా మంజూరు కాదు.

కారును గేస్ స్టేషన్‌లో ఆపారు. ఒకతను దిగాడు.

'హెల్ప్ వాంటెడ్' అన్న ఓ బోర్డును, దాని పక్కనే 'సెల్ఫ్ సర్వీస్' అన్న ఇంకో బోర్డును చూశాడు గోపీనాథ్.

"భారతదేశం కన్నా యు.ఎస్ నాలుగురెట్లు పెద్దది. జనాభా నాలుగు రెట్లు తక్కువ. అందుకే ఎక్కడ చూసినా ఇలాంటి బోర్డులు" చెప్పాడు గోపీనాథ్.

మిగిలిన ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు. గోపీనాథ్ సన్నగా నవ్వుతూ చెప్పాడు.

"చూడండి. మీ కొలీగ్‌కు హెల్పర్ ఉద్యోగం వచ్చింది."

అతను సెల్ఫ్ సర్వీస్ అన్న బోర్డు ఉన్న పెట్రోల్ పంప్‌కు ఉన్న నాజిల్‌ని అందుకున్నాడు. కారులో పెట్రోల్ పోసి దాన్ని యథాస్థానంలో ఉంచాక చెప్పాడు గోపీనాథ్.

"ఇప్పుడతనికి కాషియర్ ఉద్యోగానికి ప్రమోషన్ వచ్చింది."

అతను పెట్రోల్ డబ్బు చెల్లించాక గోపీనాథ్ మళ్ళీ చెప్పాడు.

"ఇప్పుడతని కాషియర్ ఉద్యోగం ఊడింది."

అతను వచ్చి కార్లో కూర్చున్నాక చెప్పాడు గోపీనాథ్.

"ఇలా మీరు రోజూ అనేక ఉద్యోగాలు విసుక్కుంటూనే చేస్తూ ఊడగొట్టుకుంటుంటారు. పైగా వాటిని చేసే నాలాంటి వాళ్ళని తరిమేస్తుంటారు."

ముగ్గురిలో ఎవ్వరూ మాట్లాడలేదు.

మూడు నెలలపాటు ఎటు చూసినా సముద్రమే. దారిలో ఆ ఓడ ఇంగ్లండులోని లివర్ పూల్ పోర్టులో లంగరు వేసినప్పుడు గోపీనాథ్ పారిపోకుండా ముందు జాగ్రత్తగా అతనికి బేడీలు వేసి ఓడలోని క్వారంటైన్ గదిలో బంధించి ఉంచారు. చిట్టచివరికి కొచ్చిన్ పోర్టులో లంగరు వేసింది ఓడ. అతన్ని రిసీవ్ చేసుకోవడానికి గోపీనాథ్ తండ్రి డబ్బుతో వచ్చాడు. గోపీనాథ్‌ను చూసి చేతులూపసాగారు. బదులుగా గోపీనాథ్ కూడా ఆనందంగా చేతులూపాడు. మాసిపోయిన డెనిమ్ ట్రౌజర్స్, ఆకుపచ్చ షర్టులో ఉన్న గోపీనాథ్‌ను పలకరించారు. అతని మొహంలో అలసట కనపడుతున్నా, అతని కళ్ళల్లో మటుకు ఓ విధమైన చురుకుతనం తొంగిచూస్తోంది.

"నేను అక్కడ సెటిల్ అయి గ్రీన్ కార్డు తెచ్చుకుని ఉంటే మన కుటుంబం అంతా కూడా అమెరికా రావచ్చనుకున్న నా ఆలోచన పల్టీ కొట్టింది" చెప్పాడు తండ్రితో.

"నువ్వు ఫెయిల్ అయ్యావని బాధపడకు" చెప్పాడు గోపీనాథ్ తమ్ముడు విరించి.

గోపీనాథ్ ముక్కుమీద తప్పు అన్నట్లుగా వేలు ఉంచుకుని చెప్పాడు విరంచితో.

"ఆ మాటే వాడొద్దు. నేను ఫెయిల్ కాలేదు. ఫెయిల్యూర్ అంటే ఎప్పటికీ విజయం సాధించలేకపోవటం. ఫెయిల్యూర్ అంటే మధ్యలో వదివేయటం. దీన్నంతటితో వదలడంలేదు. ఈసారి విజయం సాధించే బోలెడంత సమాచారంతో వచ్చాను. మళ్ళీ నీతో ఇదే కథను మొదలెట్టిస్తాను."

గోపీనాథ్ పట్టుదల అతని కుటుంబ సభ్యులందరికీ తెలుసు.

అంతా బయట ఆగి ఉన్న టేక్సీ దగ్గరకి నడిచారు.

కొన్నివేల మైళ్ళు సముద్రయానం చేసి వచ్చిన గోపీనాథ్‌లో ఎలాంటి బడలిక లేదు. నిర్ణయించుకున్న గమ్యానికి చేరుకోవడం సాధించాలన్న పట్టుదల అతని కళ్ళల్లో చదవగలిగాడు గోపీనాథ్ తమ్ముడు విరించి.

ఆ రాత్రే అంతా హైదరాబాద్‌కి రైల్లో బయలుదేరారు.

## 2

పకపకా నవ్వుతున్న గోపీనాథ్‌ని చూసి విరించి లేపి అడిగాడు.

"ఏమిటన్నాయ్? నిద్రలో అంత నవ్వు? కలేమైనా వచ్చిందా?"

లేచి కూర్చుని చుట్టూ చూసి కళ్ళు నులుముకున్నాడు.

"అవున్రా. కలే! భలే ఫన్నీ కల. చిన్న చిన్న మార్పులతో ఇంకోసారి వచ్చింది" ఆ కల వివరించాడు.

"అమెరికా నుంచి గెంటివేయబడ్డ నీకు పీడకలలకు బదులు ఇలాంటి హైటెక్ కలలు రావడం చిత్రమే."

చిన్నగా నవ్వి చెప్పాడు గోపీనాథ్.

"చెప్పాగా, ఓడిపోవడం అంటే మనం పూర్తిగా ఓడిపోవడం కాదురా. మనం ఇంకా విజయం పొందలేదని అర్థం. అపజయం అంటే, మనం టాలెంట్ లేని వాళ్ళం కామని కాదు అర్థం. అపజయమంటే, మనమింకా ఫర్‌ఫెక్ట్ కాలేదని అర్థం. ఫెయిల్యూర్ అంటే మనం విజయం సాధించలేమని కాదు అర్థం, ఫెయిల్యూర్ మీన్స్ యు షుట్ ట్రై హార్డర్."

మంచం దిగి చెప్పాడు గోపీనాథ్ తమ్ముడికి.

"నాలా నువ్వు అమెరికా వెళ్ళి ఈసారి ఖచ్చితంగా పొలిటికల్ అసైలమ్ సంపాదించే కొత్త విషయాలు తెలుసుకుని వచ్చాను. కాబట్టి నేను అపజయం పొందినట్లుగా కాక నువ్వు ఈ ప్రయత్నంలో విజయం సాధించబోతున్నావు. అదే ప్రస్తుతం నా మిషన్."

స్థిరమైన నమ్మకం గోపీనాథ్ మాటల్లో ప్రతిధ్వనించింది.

"తప్పకుండా. ఈలోగా నీ సలహా ప్రకారం నేను గ్రీన్‌కార్డ్ పెట్టిన అప్లికేషన్ సక్సెస్ అయితే ఇంకా మంచిది" చెప్పాడు విరించి.

ప్రశ్నార్థకంగా చూశాడు గోపీనాథ్.

"అదే అన్నాయ్! నాలుగు నెలల క్రితం నువ్వు 'స్పెషల్ లాటరీ గ్రీన్ కార్డ్ ఎంట్రీ ప్రోగ్రాం' తాలుకు అప్లికేషన్ ఫారాలు పంపించావు కదా? దాని గురించి నేను చెప్పేది" చెప్పాడు విరించి.

"ఓ! అదా! అందులో కేవలం ఏభై అయిదువేల మందికే అమెరికన్ ప్రభుత్వం గ్రీన్‌కార్డ్ లిచ్చేది."

"అంటే, ఏభై అయిదువేల అవకాశాలు ఉన్నట్లేగా?"

ఆ సంభాషణ వింటున్న తండ్రి అరుణాచలం అడిగాడు.

"స్పెషల్ లాటరీ గ్రీన్ కార్డ్ ప్రోగ్రామా? అదేంటి?"

"నాన్నకి తెలీదా అది?" అడిగాడు గోపీనాథ్.

"ఊహూ!"

"అయితే నువ్వు చెప్పు. నేను బాత్‌రూంకి వెళ్ళాలి."

విరించి ఉత్సాహంగా ఆ ప్రోగ్రాం గురించి తండ్రికి వివరించసాగాడు.

"అమెరికాకు వలస వెళ్ళాలనుకునేవారు ప్రపంచంలోని దాదాపు ప్రతిదేశంలోను ఉన్నారు. అయితే అందుకు వీసా అప్లై చేయాలంటే అందుకు ప్రత్యేక క్వాలిఫికేషన్లు అవసరం కదా, అయితే అలాంటి క్వాలిఫికేషన్లు ఏమీలేని వాళ్ళ ఈ జీవితంలో ఆశ వదిలేసుకోవాల్సిందేనా? అలా ఏ కేటగిరీ వీసాకి చెందని వాళ్ళకి అమెరికా ప్రభుత్వం ఏటా, ఏకంగా గ్రీన్‌కార్డ్‌నే డైరెక్ట్‌గా ఆఫర్ చేస్తుంటుంది - లాటరీద్వారా"

"లాటరీ ద్వారా అంటే?" అడిగాడు అరుణాచలం.

"తమ దేశంలో ఉంటూనే, అమెరికా ప్రభుత్వానికి గ్రీన్‌కార్డ్ కోసం అప్లై చేసుకునే సదుపాయం కలిపించడంతో లక్షలమంది అప్లై చేస్తారు. అయితే అందరికీ అమెరికాలోకి ఎంట్రీ ఇవ్వరు. ఏటా ఏభైఅయిదు వేల మందిని అలా అప్లై చేసిన వాళ్ళలోంచి లాటరీ పద్ధతిలో ఎంపికచేసి వాళ్ళకి గ్రీన్ కార్డ్‌నిస్తుంది అమెరికన్ ప్రభుత్వం. తక్షణం వాళ్ళు అమెరికా వెళ్ళచ్చు. అక్కడ వుండి పనిచేసుకుని బతకచ్చు. కాకపోతే ఈ స్కీమ్‌లో అప్లై చేసేవారికి తప్పనిసరిగా హైస్కూల్ డిప్లొమా లేదా రెండేళ్ళు దేంట్లోనైనా పనిచేసిన అనుభవం ఉంటే చాలు. కాకపోతే కొన్ని దేశాలవారికే ఈ లాటరీ స్కీమ్ వర్తిస్తుంది. ఆ దేశాల్లో పుట్టడమే అప్లై చేయడానికి ప్రధాన క్వాలిఫికేషన్. మన ఇండియా కూడా ఆ లాటరీ కంట్రీ జాబితాలో ఉంది."

"కాని మనకి అమెరికాలో బంధువులెవరూ లేరుగా కాగితాలు పంపడానికి?" అడిగింది విరించి తల్లి మాలతి.

"ఉండక్కర్లేదు. వెంట ఇంత డబ్బు తీసుకురావాలన్న నియమం కూడా లేదు. అసలు ఇంగ్లీష్ రాకపోయినా ఫర్వాలేదు."

"ఇదేదో బావుందే?" ఉత్సాహంగా చెప్పాడు అరుణాచలం.

"ఏభై డాలర్లు ఫీజ్. ఏభై డాలర్లు పెట్టి టిక్కెట్ కొన్నామనుకోవాలి. గెలిస్తే అమెరికాకి గ్రీన్‌కార్డ్. గెలవకపోతే లాటరీ పోయిందనుకోవడమే" చెప్పాడు విరించి.

"వచ్చే ఏడాది మళ్ళీ తీసే లాటరీలో కూడా మళ్ళీ మన పేర్లు కూడా ఈ ఏభై డాలర్లకే ఇన్‌క్లూడ్ చేస్తారు. అలా జీవితాంతం మన పేరు ఇంక్లూడ్ అవుతుంది మనకి లాటరీ తగిలేదాకా" చెప్పాడు బాత్ రూంలోంచి వచ్చిన గోపీనాథ్.

"నువ్వు ఇల్లీగల్‌గా అమెరికాలో ఇరుక్కున్నావు. లేకపోతే నువ్వు అప్లై చేసి ఉండేవాడివి" చెప్పాడు అరుణాచలం బాధగా.

"ఆ బాధేంలేదు. నేనూ అప్లై చేశాను అక్కడ్నించే" చెప్పాడు గోపీనాథ్.

"అదేమిటి? ఇల్లీగల్‌గా అమెరికాలో ఉన్నవాళ్ళు కూడా చేయవచ్చా?" అడిగాడు అరుణాచలం.

"శుభ్రంగా చేయచ్చు. లాటరీ కంట్రీలో పుట్టడమే ఇందులో ప్రధాన అర్హత, అప్లై చేసే సమయంలో ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే."

"అయితే ఈ ఏడాది నువ్వు అప్లై చేశావన్నమాట?" అడిగాడు అరుణాచలం విరించిని.

"అవును! వాషింగ్టన్ డి.సి.లోని యు.ఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ లో అందుకు మనం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అప్లికేషన్ ద్వారా ఫైల్ చేయాలి. మనకి రిజిస్ట్రేషన్ నంబరు కూడా పోస్ట్‌లో పంపుతారు. ఇలా పోగయిన వాళ్ళలోంచి ఏభై అయిదువేల మంది పేర్లని కంప్యూటర్ ద్వారా ఎన్నిక చేస్తారు. అలా ఎన్నికైన వాళ్ళకి, వారి కుటుంబ సభ్యులకి అమెరికాకి పర్మినెంట్ వీసాలిస్తారు. ఆ

అప్లికేషన్‌తో పాటు బ్రహ్మచారైతే ఏభై డాలర్లు, పెళ్ళైయిన వాళ్ళైతే డబ్బై అయిదు డాలర్లు ఫీజ్‌గా చెల్లించాలి. పెళ్ళైయిన భార్యాభర్తలిద్దరూ చెరో డెబ్బై అయిదు డాలర్లు కట్టి రెండు అప్లికేషన్స్ ఫైల్ చేసుకోవచ్చు. ఇందువల్ల వాళ్ళు అమెరికా వెళ్ళే అవకాశాలు డబలవుతాయి. ఇద్దరిలో ఏ ఒక్కరికి ఛాన్స్ తగిలినా భార్యని లేదా భర్తని, ఇరవై ఒక్క ఏళ్ళలోపు పెళ్ళికాని పిల్లలని కూడా వెంట తీసుకెళ్ళవచ్చు."

"నువ్వు ఓ పది అప్లికేషన్లు పెడితే బావుండేది" చెప్పింది మాలతి.

"ఓ మనిషి ఒక్క అప్లికేషన్‌ని మించి పెట్టకూడదన్న నిబంధన ఉంది. ఎక్కువ పెడితే డిస్క్వాలిఫై చేస్తారు."

"ఇంతకీ గ్రీన్‌కార్డ్ అంటే ఏమిటి? మన పోస్టుకార్డులాంటిదా?" అడిగింది మాలతి గోపీనాథ్‌ని.

అతను చిన్నగా నవ్వి చెప్పాడు.

"కాదమ్మా, గ్రీన్ కార్డంటే... మనం ఇంకో దేశానికి వెళ్ళాలంటే ఆ దేశ ప్రభుత్వం అనుమతి అందుకు తీసుకోవాలి. అదుంటేనే కానీ ఆ దేశంలోకి బయటివాళ్ళని అడుగు పెట్టనివ్వరు. దాన్నే వీసా అంటారు. ఈ వీసాలలో అనేక రకాలున్నాయి. సింగిల్ ఎంట్రీ వీసా అంటే ఒక్కసారి అమెరికాకి వెళివచ్చే వీసా. ఇంకోసారి వెళ్ళాలంటే అళ్ళీ వీసా తీసుకోవాలి. అమెరికా బోర్డర్‌లో కెనడాలో ఉన్న నయాగరా ఫాల్స్‌ని చూద్దామనుకున్నవారు అమెరికా వదిలి కెనడాలోకి వెళితే సింగిల్ ఎంట్రీ వీసాతో తిరిగి అమెరికాలోకి రాలేరు. అందువల్ల ఇంకోసారి అమెరికా వెళ్ళాలంటే డబుల్ ఎంట్రీ వీసా అవసరం అవుతుంది."

ఆసక్తిగా వినసాగింది మాలతి కొడుకు చెప్పేది.

"అలాగే అమెరికాలో ఉండి ఉద్యోగం చేస్తున్నవారు తరచు తమ స్వదేశానికి వెళ్ళి వస్తుండాల్సిన పన్లుంటాయి. అమెరికా నుంచి ఇండియాకి వచ్చిన ప్రతిసారి వాళ్ళు వీసా తీసుకోవాల్సిన అవసరం లేకుండా మల్టిపుల్ వీసాని, అంటే అమెరికాలో నుంచి బయటకు వచ్చాక తిరిగి అమెరికా ఎన్నిసార్లయినా వెళ్ళొచ్చనే వీసాని తీసుకుంటే ఇండియాకి వచ్చిన ప్రతిసారీ వాళ్ళు అమెరికన్ కన్సొలెట్‌కి వీసాకోసం వెళ్ళక్కర్లేదు. దీన్నే గ్రీన్‌కార్డ్ అంటారు. అయితే అమెరికాలో కంటిన్యూస్‌గా కనీసం ఐదేళ్ళు ఉన్నవారు మాత్రమే గ్రీన్‌కార్డ్‌కి అప్లయ్ చేయడానికి అర్హులు. ఇది అమెరికాలోనే జారీచేస్తారు."

"అందుకనా ప్రతివాళ్ళ ధ్యేయం గ్రీన్‌కార్డ్?" నవ్వింది మాలతి.

"గ్రీన్‌కార్డున్న బ్రహ్మచారి పెళ్ళిచేసుకుంటే తన భార్యని తేలిగ్గా అమెరికాకి తీసుకెళ్ళచ్చు" చెప్పాడు అరుణాచలం.

"పోన్లే. అంతా దేవుడి దయ" చెప్పింది మాలతి.

"దేవుడి దయకాదు. సైబర్ దేవుడి దయ అను. డబ్ల్యు. డబ్ల్యు డబ్ల్యు. సిద్ధివినాయక డాట్ ఓ ఆర్జికి వెళ్ళి ఆ వినాయకుడికి కొబ్బరికాయకొట్టి మరీ అప్లై చేశాను" చెప్పాడు గోపీనాథ్ నవ్వుతూ.

"దేవుళ్ళ విషయంలో జోక్ చేయకూడదురా" గోపీనాథ్ తల్లి మాలతి కోప్పడింది.

"జోక్ కాదు ఆ సైట్ నిజంగా ఉంది. ఇప్పుడు ప్రతీదేవుడికి, ప్రతీ బాబాకి., ప్రతీ అమ్మకి, ప్రతీ పుణ్యక్షేత్రానికి ఓ సైబర్ సైట్ ఉందమ్మా" వివరించాడు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments